# కన్నతల్లి

భూపాల్

ఎంతో కష్టపడి ఎట్టకేలకు తన భర్త తన కొడుకును ప్రగతీ రెసిడెన్షియల్ స్కూల్లో వేశాడని తెలుసుకుంది మాధవి. కొడుకును చూడక సంవత్సరం దాటింది. వాడు రెండు సంవత్సరాలున్నప్పుడు భర్తకు దూరమైంది.

మాధవి చేసిన తప్పేమంటే ఏ మనిషైనా కొంచెం స్వతంత్రంగా వుండాలని, వ్యసనపరుడైన భర్తే ఐనా సూటిగా విమర్శించడంలో తప్పులేదని, స్త్రీకి కొంత ఆర్థిక వనరు వుండాలని... స్వతంత్రంగా వుండాలంటే నిష్కల్మషంగా మగవాళ్లతోనైనా మాట్లాడాలంది. స్నేహం ఆశించింది. తను కొనుక్కోవాలనుకున్నవి వీలును బట్టి భర్తకు తెలియకున్నా కొన్నది. ఇక భర్త తాగుడు అలవాట్లు, తన గూర్చి అస్సలు పట్టించుకోలేని పద్ధతి, తరుచూ పేకాట ఆడటాన్ని వ్యతిరేకించింది. మరోటిగా ఆర్థిక స్వాతంత్ర్యం, సదుపాయం ఆడవాళ్లకు అవసరమేనని తలచి తన దగ్గర స్నేహితురాల్ని నమ్మి తన తండ్రి ఇచ్చిన పెద్ద నగ అమ్మి ఏదో స్కూలు అభివృద్ధి కోసం డబ్బులిచ్చి తనూ భాగస్వామిగా వుందామనుకుంది. భర్త ఈ విషయాన్ని చాలా పెద్ద తప్పుగా తీసుకున్నా నగ అమ్మే ముందు చూచాయగా చెబితే అతను గట్టిగా వద్దని మందలించలేదు. ఐతే స్నేహితురాలు మోసం చేయడంతో తాను నేరస్తురాలిగా భర్త ముందు నిలబడక తప్పలేదు.

ఇన్ని కారణాలు చూపించి ఆమెను తన్ని రెండు సంవత్సరాల బాబుని లాక్కొని పంపించేశాడు. అమె తన స్నేహితులతో ఇతర బంధువులతో స్వేచ్ఛగా వున్న కారణంగా 'కులట'గా ముద్ర కూడా వేశాడు. దాంతో మాధవి అతన్ని అసహ్యించుకొంది. నీచుడిగా చిత్రించుకుంది. తన్ని తగిలేస్తే పిరికిదానిలా చచ్చిపోకుండా అమ్మగారింటికెళ్ళి ఏదో టైలరింగ్ పని చేసుకుంటూ తన కొడుకును తలుస్తూ ఏడుస్తూ కాలం గడిపేసింది సంవత్సరం. ఆమె తండ్రి కోర్టుకెళ్ళి జీవనభృతి కోసం, మైనరైన కొడుకు కోసం కేసు వేద్దామన్నాడు. అందుకామె అప్పుడే వద్దని ఆపేసింది.

కొడుకు 'అరుణ్' తన అత్త ఇంట్లో వున్నాడు. మూడు సంవత్సరాల ప్రారంభంలో భర్త ఇక వాడికి చదువు అవసరమని రెసిడెన్షియల్ స్కూల్లో వేశాడు. ఈ మధ్య సంవత్సర కాలంగా ఆమెనూ, ఆమె వైపు వాళ్లనూ ఎవ్వరినీ తన ఇంటి రానిచ్చేవాడు కాదు భర్త. దూరంగా నిలబడి కొడుకును చూద్దామన్నా, పక్క ఇంటివాళ్లతో పిలిపించుకొని చూద్దామన్నా, ఏదో పెండ్లికో పేరంటానికో వస్తే చూద్దామన్నా వీలు కల్పించలేదు సరిగదా భర్త ఉగ్రరూపం దాల్చాడు.

మాధవి తన అరుణ్ కోసం అంతర్గతంగా ఎంతో కుమిలిపోయింది. తపించని రోజు లేదు. తలుచుకుంటూ విలపించని రాత్రి లేదు. చిన్ననాటి చిలిపి చేష్టలు, చిన్నచిన్న మాటలు, తప్పటడుగులు, పరుగులు, అమ్మకోసం ఆరాటం, ఆకలని ఏడ్వడం, మొండికేసి అలగడం, తన కన్నీళ్లు ఆ చిన్నారి చేతులతో తుడ్వడం అన్నీ జ్ఞాపకమొచ్చి కుమిలి కుమిలి ఏడుస్తుంది మాధవి.

ఇప్పుడు 'ప్రగతి'లో కొడుకున్నాడని తెల్సింది. అక్కడికెళ్ళింది మాధవి. స్కూలు ప్రిన్సిపాల్ కం మేనేజింగ్ పార్టనర్ శ్రీమతి వసంతరావుతో మాట్లాడింది. తన కొడుకును చూపించమంది. అందుకు శ్రీమతి వసంతరావు ఒప్పుకోలేదు. ఎవరైతే బాబును ఇక్కడ చేర్చారో వారు విజటర్స్ పేర్లలో అతనొక్కని పేరు మినహా ఎవ్వరి పేరూ ఇవ్వలేదనీ, ఎవ్వరొచ్చినా చూపించకూడదనీ, ఏ వస్తువు ఇచ్చినా అరుణ్‌కు ఇవ్వకూడదనీ, బయటివారిచ్చింది ఏదీ తినిపించ కూడదనీ అతను ఖచ్చితంగా చెప్పాడు.




నన్ను మీరు క్షమించాలి" అని పంపించేసింది.

మరోసారి వెళ్ళినప్పుడు బాబును వాళ్ల తండ్రి ఇంటికి తీసుకెళ్లాడని, బాబు ఈ మధ్య బాగా జబ్బుపడ్డాడని చెప్పింది చెప్పకూడదని అనుకుంటూనే, దాంతో మాధవి గుండె మరీ కొట్టుకుంది.



ఆ వారంరోజుల్లో మాధవి ప్రగతి రెసిడెన్షియల్ స్కూలుకు రోజు ఫోన్ చేసి 'బాబు విషయం' చెప్పండని తహతహలాడుతూ అడిగింది. శ్రీమతి వసంతరావుగారు చాలా విసుక్కున్నారు. ఈమెనేమో రాకూడదన్నా వస్తోంది. ఈమె వస్తోందని చెపితే అతనితో ఇబ్బందే కాకుండా బాబును తీసి మరో చోట వేస్తారు. ఏం చేయాలో తోచలేదు. ఇలాంటి పరిస్థితుల్లో మాధవితో ఓ ఒప్పందం కుదుర్చుకుంది. ఒకే ఒక్క సారి బాబును చూపిస్తాను దూరంగా, మాట్లాడకూడదు. మళ్ళీ ఆరునెలల వరకు స్కూలు ఛాయల్లోకి రావొద్దని చెప్పింది. అందుకు ఒప్పుకుంది మాధవి. బాబు మామూలు వాడై వచ్చాడు. స్వస్థత చేకూరింది. బాబు తండ్రి రాని తేదీ చూసి, సమయం నిర్ణయించి ఫలానా గంటలో ఫలానా చోట నిలబడితే వాడు అటుగా వచ్చి ఆడు కుంటాడు. చూసి పొండని చెప్పింది శ్రీమతి వసంతారావు.

బాబును చూపిస్తారన్న రోజు వచ్చేసింది. మాధవి బొమ్మలు, ఆటవస్తువులు, చాక్లెట్లు తీసుకుని దేవుడు దర్శనమిస్తానన్నా తనకు అక్కర్లేదని పేగు తెంచుకు పుట్టిన కొడుకే దేవునికన్నా తనకు ముఖ్యమని ఎక్కడలేని ఉత్సాహంగా రాత్రంతా ఆనందంతో నిద్రలేమి కళ్లతో, నిన్నటి నుండి అన్నం సైతం రుచించని తల్లి మమకారంతో గంట ముందుగానే వెళ్ళి ఆ స్కూల్ గేటు దగ్గర నిలబడింది.

గంట తర్వాత మేడమ్ వసంతరావు మాధవిని చూస్తే ఆమెకు జాలివేసింది. నిన్నటి రోజే బాబును పెట్టా బేడాతో మళ్ళీ రాకుండా తీసుకెళ్ళి పోయారనీ, ఎక్కడికి తీసుకెళ్ళారో తెలియదంటూ "మీరు వస్తున్నట్లు ఎవరు చెప్పారో అర్థం కాకుంది" అంది.

"మేడమ్! బాబు బాగున్నాడా?" అడిగింది మాధవి బాధతో.

"బాబుకేమమ్మా! గుమ్మడిపండులా, అందంగా బొద్దుగా, ఉత్సాహంగా, తెలివిగా ఉన్నాడు. అతనో మూర్ఖుడు, ఇంకా కాపురం చేస్తావా అతనితో, విడాకులిచ్చి నీ బాబును నువ్వు తీసుకో" అంది శ్రీమతి వసంతరావు మేడమ్.

'ఔను. అదే చేయాలి' అనుకుంది మాధవి దృఢ చిత్తంతో.

